క్లుప్తంగా

క్రికెట్ పోటీలు ప్రారంభం



పెబ్బేరు రూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని సూగూరులో మాజీ సర్పంచ్ రాజశేఖర్‌గౌడ్ క్రికెట్ పోటీలను శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో శన్ముఖి, గునమోని పరశురాం, నరసింహ, తిరుమలేష్ యువకులు పాల్గొన్నారు.

రేమద్దులకు చేరిన సైకిల్‌యాత్ర



పాన్‌గల్: మండలంలోని రేమద్దులకు చెందిన రామ భక్తుడు చింతకుంట చల్మారెడ్డి అయోధ్య రామచంద్రుడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా వచ్చిన పూజిత అక్షింతలను శనివారం హైదరాబాద్ నుంచి సైకిల్ యాత్ర ద్వారా గ్రామానికి శనివారం తీసుకొచ్చారు. గ్రామానికి తెచ్చిన అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.

సన్మానం



పాన్‌గల్: అత్యవసర పరిస్థితుల్లో మేమున్నామంటూ బాధితులకు సాయం చేసిన వారిని మండల కేంద్రంలో పోలీసులు శనివారం సన్మానించారు. మండలంలోని రేమద్దులలో బావిలో పడి మృతి చెందిన వ్యక్తిని బయటకు తీయడంలో ధైర్యాన్ని ప్రదర్శించిన గ్రామానికి చెందిన అన్న రమేష్, ఇటీవల బండపల్లి స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారిని తరలించడంలో సహకరించిన వెంగళాయిపల్లికి చెందిన ఆటో డ్రైవర్ సాయికుమార్‌కు ఎస్‌ఐ వేణు, పోలీసులు అభినందించారు.

రోడ్డు పై గుంతలకు మరమ్మతు



పాన్‌గల్: మండల కేంద్రం నుంచి శాగాపూర్ వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి ప్రయాణానికి ఇబ్బందిగా మారింది. విషయాన్ని స్థానికులు గ్రంథాలయ సంస్థ జిల్లా డైరెక్టర్ బాలరాజుయాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెద్ద బాలరాజు దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందించి సొంత ఖర్చులతో శనివారం రోడ్డుపై గుంతలకు మట్టి వేయించారు. కార్యక్రమంలో నాగేంద్రం, చిన్నమైబూబ్, కుర్మయ్య, పరమేష్, పెద్దమైబూబ్, రాములు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు



సాయికుమార్ (ఫైల్)

కొత్తకోట రూరల్: ప్రేమ వివాహం చేసుకున్న ఓ వ్యక్తి కుటుంబ కలహాలతో రెండు రోజులుగా కనిపించకపోవడంతో అతడి భార్య కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పెబ్బేరు మండలం శాఖాపూర్(వై) గ్రామానికి చెందిన సాయికుమార్, జక్కుల శివప్రియ ప్రేమ వివాహం చేసుకున్నారు. సాయికుమార్ కొంత కాలంగా వివిధ దినపత్రికలో, టీవీ చానల్స్‌లో (సాక్షి కాదు) పనిచేసేవాడు. వీరికి విప్లవ్ అనే 9ఏళ్ల కుమారుడు ఉన్నాడు. వివాహం అనంతరం కొన్ని రోజులు పెబ్బేరులో.. అక్కడి నుంచి వనపర్తికి మాకాం మార్చారు. కొన్ని రోజులుగా భార్య భర్తల మధ్య తరచూ గొడవ జరుగుతుండేది. ఇదే విషయమై సాయికుమార్ మేనమామ అయిన అప్పరాల సర్పంచ్ భర్త కొమారి శంకర్‌నాయుడు వద్ద ఈనెల 7న గ్రామంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టి సర్దుకుపోవాలని సూచించారు. ఈ క్రమంలో సాయికుమార్ హైదరాబాద్ వెళ్తున్నా.. వారం రోజుల తర్వాత వస్తాను అని అప్పరాల నుంచి వెళ్లిపోయాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో పాటు బంధువులు, సాయికుమార్ స్నేహితుల వద్ద ఆరా తీసిన ఆచూకీ లభించకపోవడంతో సాయికుమార్ భార్య శివప్రియ కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు కొత్తకోట ఎస్‌ఐ ఫోన్ నంబర్ 87126 70621 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

అందుబాటులోకి వచ్చేనా..

- మండల కేంద్రంలో మూతపడిన ఆధార్ కేంద్రం
- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు
- తప్పనిసరి పరిస్థితుల్లో జిల్లా కేంద్రానికి..



గోపాల్‌పేట మండల కేంద్రంలోని ఆధార్‌సెంటర్ (ఫైల్)

గోపాల్‌పేట: అప్పుడే పుట్టిన పిల్లాడి నుంచి మరణించే వరకు ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు ముఖ్యమైంది. అంతే కాకుండా ప్రభుత్వ పథకాలను పొందాలంటే ఆధార్ తప్పనిసరిగా ఉండాల్సిందే. ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో గతంలో ఒక ఆధార్ సెంటర్ ఉండేది. కానీ అది మూతపడి సుమారు ఏడాది పూర్తయింది. అయినా ఇప్పటికీ ఆధార్ సెంటర్ తిరిగి ప్రారంభించేందుకు అధికారులు చొరువ తీసుకోవట్లేదు. దీంతో ఉమ్మడి గోపాల్‌పేట మండల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మండలంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 60 వేల జనాభా ఉండేది. ప్రస్తుతం తొంభై వేల వరకు చేరుంటుందని అధికారుల అంచనా వేస్తున్నారు. అయితే కొత్తగా నమోదు చేసుకునే చిన్న పిల్లలు, పెళ్లయిన వారికి అడ్రస్ మార్పు, పేర్లలో తప్పొప్పులు సరి చేసుకునేందుకు ఆధార్ అందుబాటులో లేదు.

జిల్లా కేంద్రానికి పరుగులు

మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం అందుబాటులో లేకపోవడంతో అవసరం అయిన వారు తప్పనిసరి పరిస్థితుల్లో జిల్లా కేంద్రానికి పరుగులు తీయాల్సి వస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సమయంతో పాటు డబ్బులు అధికంగా ఖర్చు అవుతుందని వాపోతున్నారు. స్థానికంగానే ఆధార్ సెంటర్ ప్రారంభిస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని మండల ప్రజలు కోరుతున్నారు. గోపాల్‌పేట మండల కేంద్రంలో ఉన్న ఆధార్ సెంటర్‌లో ఎక్కువగా అప్లికేషన్లు రిజెక్ట్ అవుతున్నాయన్న కారణంగా ఏడాది క్రితం ఆధార్‌సెంటర్ ఐడీని బ్లాక్ చేసినట్లు అప్పట్లో అధికారులు చెప్పారు. అప్పటి నుంచి ఆధార్ సెంటర్ తిరిగి ప్రారంభించలేదు. తర్వాత మళ్లీ ఎగ్జామ్ పెట్టి అర్హులకు కేంద్రం మంజూరు చేస్తామని చెప్పినా ఇప్పటి వరకు అడుగులు పడలేదు.

తిరగడంతోనే సరి..



మా పాపకు ఆధార్‌కార్డు తీసేందుకు, నా భార్య అడ్రస్ మార్చేందుకు వనపర్తికి ఐదు సార్లు తిరిగి మార్పులు చేయించాం. దాదాపు పది రోజుల తర్వాత వెళ్లి అడిగితే ఒక పాపది ఆధార్ అయింది. నా భార్యది ప్రాసెస్‌లో ఉంది. ఇంకొకరిది రిజెక్ట్ అయింది. మళ్లీ ఆధార్ సెంటర్‌కు ఎప్పుడు రావాలని అడిగితే వారం రోజులు టైం చెప్పారు. అప్పుడైనా అవుతుందో లేదో. స్థానికంగా ఆధార్ సెంటర్ ఉంటే బాగుంటుంది.

– సీహెచ్ రాములు, గోపాల్‌పేట

అందుబాటులోకి తేవాలి



ఆధార్ సెంటర్ మూతపడి ఏడాది పూర్తయినా తిరిగి ప్రారంభించలేదు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం అన్నింటికి ఆధార్ తప్పనిసరి చేయడంతో పథకాలకు అనర్హులుగా మిగిలిపోతున్నాం. ఉన్నతాధికారులు ఇప్పటికైనా ఆలోచించి వెంటనే ఆధార్‌సెంటర్ తిరిగి ఓపెన్ చేసేందుకు కృషి చేయాలి

– వెంకటయ్య, గోపాల్‌పేట

సమస్య పరిష్కరిస్తాం



నేను ఇక్కడికి రాకముందే ఆధార్‌సెంటర్ మూతబడింది. నాలుగు రోజుల్లో డిజిటల్ సంతకం చేస్తా. ఆతర్వాత అప్రూవ్ చేసేందుకు సుమారు 20 రోజులు పట్టొచ్చు. వీలైనంత తొందరగా ఆధార్‌సెంటర్ ఓపెన్ చేయించేందుకు ప్రయత్నిస్తా.

– శ్రీనివాసులు, తహసీల్దార్, గోపాల్‌పేట

అందరూ క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 11వ వార్డు నాగవరం తండాలో శనివారం క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలను స్నేహపూర్వకంగానే ఆడాలని, ఎలాంటి శత్రుత్వం పెంచుకోకుండా పోటీ పడాలన్నారు. గెలుపు, ఓటమిలు సహజమని, ఓడిపోతే నిరాశ చెందకుండా ఓటమిని స్వీకరించి, రెట్టింపు ఉత్సాహంతో మళ్లీ ప్రయత్నించాలన్నారు. అంతకుముందు నాగవరం తండాలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో లక్కాకుల సతీష్, చీర్ల విజయ చందర్, కౌన్సిలర్లు సుమిత్ర, చీర్ల సత్యం, విభూది నారాయణ, షఫీ, నాయకులు సత్యశీలారెడ్డి, యాదగిరి, కృష్ణబాబు, చంద్రమౌళి, డి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు

జిల్లా కేంద్రంలోని కర్రెమ్మ గుడి వద్ద శనివారం గంధం ఆంజనేయులు జ్ఞాపకార్థం గంధం చరణ్ ఆధ్వర్యంలో కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ సభ్యుడు గంధం నాగరాజు, ద్యారపోగు రవిప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

వీపనగండ్ల: యువకులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి గెలుపోటములు సమానంగా తీసుకున్నప్పుడే క్రీడల్లో రాణించగలుగుతారని ఎంపీటీసీ ఫోరం జిల్లా అధ్యక్షుడు ఇంద్రకంటి వెంకటేష్, ఎస్‌ఐ రవిప్రకాశ్ అన్నారు. శనివారం సంగినేనిపల్లిలో ఇంద్రకంటి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ పోటీలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మౌలాలీ, నారాయణరెడ్డి, ఎత్తం కృష్ణయ్య, పందెం విజయభాస్కర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కృష్ణయ్య, చక్రవెంకటేష్, ధనుంజయ, రాంరెడ్డి, ఉపసర్పంచ్ లక్ష్మయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో కీ.శే. దేవని చంద్రయ్య జ్ఞాపకార్థం అతడి సోదరుడు శ్రీనివాసులు ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఫైనల్‌లో మొదటి విజేతగా నిలిచిన కొత్తకోట మండలంలోని సంకిరెడ్డిపల్లి జట్టుకు రూ.30 వేలతో పాటు షీల్డ్, రెండో బహుమతి రూ.20వేలు అంజి లెవన్ జట్టుకు ఎంపీపీ గాయత్రి, విండో అధ్యక్షుడు జగన్నాథంనాయుడు, దేవని శ్రీనివాసులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పృథ్వీరాజు, విజయ్, శ్రీహరి, రాజు, బుచ్చన్న, నరేష్‌నాయుడు, సుమ్మ, వసంతపురం రాజు, కాళ్ల రాఘవేందర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.





శ్రీరంగాపురంలో విజేతలకు బహుమతులు అందజేసున్న నాయకులు,వనపర్తిలో..

క్యాలెండర్ ఆవిష్కరణ



అమరచింత: ఏఐకేఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, టీపీసీసీ గీతకార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్‌ల చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ తెలిపారు. రైతు సమస్యలపై రైతు పక్షాన ఉంటూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు చేస్తున్న ఏకైక రైతు సంఘం తమదే అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా, ఆయూబ్‌ఖాన్, అజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంధ్యకు సన్మానం

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని చిమనగుంటపల్లికి చెందిన సంధ్య వనపర్తి జిల్లా కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి గ్రామంలో శనివారం సంధ్యను శాలువాతో సన్మానించారు. శ్రీసాయి స్టడీ సర్కిల్ డైరెక్టర్ చారి, సురేష్, అధ్యాపక బృందం ఆమెను అభినందించారు.

శాశ్వతంగా తాగునీటి సౌకర్యం

అమరచింత: మున్సిపాలిటీ పరిధిలోని కొత్తతండాలో తాగునీటి ఇబ్బందులు రాకుండా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. మున్సిపల్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు తండాను శనివారం సందర్శించారు. మిషన్ భగీరథ ద్వారా రూ.రెండు లక్షలతో ప్రపోజల్స్ పంపామని, త్వరలోనే అసంపూర్తిగా ఉన్న పైప్‌లైన్ పనులను పూర్తి చేసి తాగునీటి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. తండాలో సీసీ రహదారులతో పాటు డ్రెయినేజీల నిర్మాణ పనులను త్వరిత గతంగా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జీఎస్ గోపి, నాయకులు ఆయూబ్‌ఖాన్, అరుణ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, నాగునాయక్, హనుమంతు నాయక్ పాల్గొన్నారు.



పైప్‌లైన్ కోసం స్థలం పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ మంగమ్మ

కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని నాగవరంతండాలో శనివారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, స్థానిక నాయకులతో కలిసి కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తండాలో సంక్రాంతి పండుగ సందర్భంగా జరుగుతున్న క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో చీర్ల చందర్, సత్యశీలారెడ్డి, సతీష్, కృష్ణబాబు, కౌన్సిలర్ సుమిత్ర, చీర్ల సత్యం, విభూతి నారాయణ, షఫీ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు గోపాల్‌పేట విద్యార్థులు



గోపాల్‌పేట: జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జనవరి 16 నుంచి నిర్వహించే ఫుట్‌బాల్ ఎస్‌జీఎఫ్ అండర్–14 టోర్నమెంట్‌లో గోపాల్‌పేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఆడనున్నారని పీడీ సురేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రమాకాంత్ తెలిపారు. నవంబర్ 17 నుంచి 19 వరకు గద్వాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో గోపాల్‌పేట జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అండర్ 14లో ప్రశాంత్, శైలజ, మాధవి జాతీయ స్థాయిలో ఆడటం ఎంతో గర్వంగా ఉందని పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు..



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మానస జిల్లా స్థాయి కబడ్డీ పోటీలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైందని హెచ్‌ఎం నాగేందర్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల16 నుంచి 18 వరకు జనగాం జిల్లాలో నిర్వహించే అండర్–14 బాలికల కబడ్డీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి పాల్గొంటుందన్నారు. విద్యార్థిని రాష్ట్రస్థాయికి ఎంపికకావడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. మానసను హెచ్‌ఎం, పీఈటీ నిరంజన్‌గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, నాయకులు అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సంక్రాంతి సంబరాలు



వీపనగండ్లలో..



అమరచింతలో..

కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్ట అంగన్‌వాడీ కేంద్రం–1లో అంగన్‌వాడీ టీచర్ తిరుమలేశ్వరి శనివారం చిన్నారులతో కలిసి సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులను అక్షింతలు వేసి ఆశీర్వదించడంతో పాటు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం చిన్నారులు, తల్లిదండ్రులు గాలిపటాలు ఎగరవేశారు. అంతకు ముందు చిన్నారుల తల్లులతో రంగు రంగుల ముగ్గులు వేయించారు. కార్యక్రమంలో తల్లులు సునీత, రేవతి, అనిత, తిరుపతమ్మ, కృష్ణవేణి, అంగన్‌వాడీ ఆయా మన్నెమ్మ, కిషోర బాలికలు జీవిత, భానుశ్రీ, శ్వేత పాల్గొన్నారు.

వీపగనండ్ల: మండల కేంద్రంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులపై రేగిపండ్లను వేసిన అంగన్‌వాడీ టీచర్లు భవిష్యత్‌లో వారు విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మిఠాయిలను పంచిపెట్టారు. కార్యక్రమంలో టీచర్లు సుగుణాబాయి, సువర్ణ, మహేశ్వరి, హెల్పర్లు, ఈశ్వరమ్మ, లచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పతంగుల సందడి

అమరచింత: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో పతంగుల సందడి నెలకొంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో చిన్నారులతో పాటు యువకులు సైతం గాలిపటాలను ఎగురవేస్తూ సంతోషంగా గడిపేస్తున్నారు. గతంలో గ్రామాల్లో కోళ్ల పందాలు నిర్వహించేవాళ్లు. ప్రస్తుతం కోళ్ల పందేలు నిషేధం ఉండటంతో గ్రామీణ స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తూ పండుగను సరదాగా గడిపేస్తున్నారు.



కనిమెట్ట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను ఆశీర్వదిస్తున్న టీచర్, చిన్నారుల తల్లులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం





పామిరెడ్డిపల్లిలో ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు,శ్రీరంగాపురంలో..

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లికి చెందిన పానుగంటి తిరుపతయ్య అనారోగ్యం శుక్రవారం రాత్రి మృతి చెందారు. స్థానిక నాయకులు బాధిత కుటంబ ఆర్థిక పరిస్థితిని ఎమ్మెల్యే మేఘారెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఆయన రూ.10వేలు పంపించారు. శనివారం కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి నగదును అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధయ్య, తిక్కన్న, శ్రీశైలం, మన్నెం, వెంకటయ్య, నర్సింహ, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన చనమోని రవి విద్యుదాఘతంతో ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను శనివారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు శివయాదవ్ పరామర్శించి, రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ కాలనీ చెందిన పుల్లగూరి చంద్రమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రజాప్రతినిధులు శనివారం మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్ యాదవ్ రూ.5వేలు, సర్పంచ్ వినీలా రాణి రూ.5వేలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములుయాదవ్, బీరం రాజశేఖర్‌రెడ్డి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 6వ వార్డుకు చెందిన దత్తు రాములు గుండెపోటుతో, 19వ వార్డుకు చెందిన తాయారా బేగం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఇరువురి కుటుంబాలకు చేరో రూ.5వేల చొప్పున ఆర్థిక సాయాన్ని నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్, పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్‌కు ఇచ్చి అందజేయించారు. ఈ మేరకు మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, బాధిత కుటుంబాలకు పరామర్శించి, ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో కృష్ణ బాబు, వెంకటేష్, బాలరాజు, రఘుపతి, ఎండీ పాషా, అస్లాం, లతీఫ్ ఉన్నారు.

రామ అక్షితలు పంపిణీ

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణదేవరాయ నగర్ కాలనీ (కేడీఆర్)లో శనివారం అయోధ్య రామ అక్షింతలను వీరహనుమాన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురంలో శనివారం శ్రీరాముల వారి అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచు రాంరెడ్డి, విశ్వహిందూ పరిషత్ నాయకుడు బెస్త శ్రీను, నవీన్‌రెడ్డి, అంజి, శ్రీను, నారాయణ, కిశోర్‌రెడ్డి, మహేష్, రాఘవేందర్ చేశారు.



సోళీపురంలో అక్షింతలకు ఊరేగింపు చేస్తున్న భక్తులు

నేటినుంచి వీరాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

ఖిల్లాఘనపురం: ఖిల్లాగట్టు వీరాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయ ధర్మకర్త పట్టాభిరాములు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఖిల్లాగట్టు ప్రథమ ముఖ ద్వారం వద్ద కాకతీయుల కాలంలో వెలిసిన స్వామివారి ఉత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. ఎంతో మహిమ గల ఆంజనేయ స్వామి ఉత్సవాలను పురాతన కాలం నుంచి ప్రతి ఏడాది మకర సంక్రాంతి పండుగ సమయంలో నిర్వహించడం ఆనవాయితీ.

ఉత్సవాల వివరాలు..

14న మొదటిరోజు సోమవారం ఉదయం స్వామి వారి సుప్రభాతసేవతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. ఆ తరువాత పంచామృత అభిషేకం, అష్టోత్తర శతనామావళితో పాటు స్వామివారి ఉత్సవ విగ్రహం, పాదుకలను ఆంజనేయ స్వామి మాలధారులు ఊరేగింపుగా గ్రామం నుంచి గట్టుపైకి చేర్చుతారు. రాత్రివేళలో వివిధ గ్రామాల నుంచి వచ్చే భజనమండలి భక్తులచే అఖండ భజన కార్యక్రమం ఉంటుంది. 15న పంచామృత అభిషేకం, స్వామివారికి సహస్రనామార్చన తమల పాకులు, పుష్పాలతో ప్రత్యేక పూజలు, మకర సంక్రాంతి దివ్య జ్యోతిని వెలిగించడం తదితర పూజలు చేస్తారు. 16న అభిషేక కార్యక్రమాలతో పాటుగా స్వామివారి జలకేళి తెప్పోత్సవం, రథోత్సవం(తేరు) కార్యక్రమాలు ఉంటాయి.



ఆంజనేయస్వామి మూలవిరాట్